Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

స్పాట్ ఎడిషన్

మంగళవారం అక్టోబర్ 22, 2024

## మంత్రి కొండా సురేఖపై రూ. 100 కోట్ల పరువు నష్టం దావా: కేటీఆర్






తెలంగాణ వీణ, హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దాడులు చేసేవారిపై పోరాటం చేస్తానని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేటీఆర్ తాజాగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ చేశారు. "నా పాత్రపై వ్యక్తిగత దాడులు, నిరాధార ఆరోపణలు చేసేవారిపై తప్పకుండా పోరాటం చేస్తాను. న్యాయ వ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. తప్పకుండా నిజం గెలుస్తుందనే విశ్వాసం కూడా ఉంది. మంత్రి కొండా సురేఖ దురుద్దేశపూరితమైన, చౌకబారు వ్యాఖ్యలకు గాను ఆమెపై రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేశాను. చాలా కాలంగా నిరాధార ఆరోపణలకు అడ్డూ అదుపూ లేకుండా పోయాయి. కొంతకాలంగా సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక నుంచి అలాంటి ఆరోపణలు చేయకుండా కట్టడి చేయాలి. నేను ఎల్లప్పుడూ వ్యక్తిగత విమర్శల కంటే ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తాను. రాజకీయ విమర్శల పేరుతో చౌకబారు ఆరోపణలు చేసేవారికి ఈ వ్యాజ్యం ఒక గుణపాఠం అవుతుందని అనుకుంటున్నాను" అని కేటీఆర్ తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# దేశంలోని అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బాంబు బెదిరింపు...




తెలంగాణ వీణ, హైదరాబాద్ : ఢిల్లీ, హైదరాబాద్ సహా దేశంలోని అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు సోమవారం అర్ధరాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో బాంబ్ స్క్వాడ్ లతో తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్‌లోని జవహర్ నగర్ పరిధిలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్పీఎఫ్ స్కూళ్లకు మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. బెదిరింపు మెయిల్ వచ్చిన విషయం తెలియగానే జవహర్ నగర్ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్దకు చేరుకున్న పోలీసులు విద్యార్థులను, అక్కడున్న వారిని బయటకు పంపించింది. ఘటనాస్థలికి చేరుకున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు, కుషాయిగూడ ఏసీబీ మహేశ్ పరిస్థితిని పరిశీలించారు. అయితే ఈ బెదిరింపు మెయిల్ వట్టిదే అని తేలింది.ఆదివారం దేశరాజధానిలోని రోహిణిలో పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటిరోజే దేశవ్యాప్తంగా అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో పోలీసులు, యాజమాన్యం అప్రమత్తమైంది.

**సికింద్రాబాద్‌లోని జవహర్ నగర్ సీఆర్పీఎఫ్ స్కూల్లో పోలీసుల తనిఖీలు**

## జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు దారుణ హత్య..

- జగిత్యాల జిల్లా జాబితాపూర్‌లో కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి హత్య..
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న గంగారెడ్డి..
- జగిత్యాల–ధర్మపురి రోడ్డుపై జీవన్‌రెడ్డి బైఠాయింపు..
- జగిత్యాలలో బీఆర్ఎస్ రాజ్యం నడుస్తోందా అంటూ పోలీసులపై జీవన్ రెడ్డి ఆగ్రహం



తెలంగాణ వీణ, జగిత్యాల : జగిత్యాల జిల్లా రూరల్ మండలం జాబితాపూర్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. సంతోశ్ అనే వ్యక్తి గంగారెడ్డిని కారుతో ఢీకొట్టాడు.. ఆ తర్వాత కత్తితో పొడిచినట్లు స్థానికులు తెలిపారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ గంగారెడ్డిని స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు వెల్లడించారు. ఇక, గ్రామంలో రాజకీయ కక్షలే హత్యకి ప్రధాన కారణమని తెలుస్తుంది. దీంతో జగిత్యాల– ధర్మపురి ప్రధాన రహదారిపై బైఠాయించిన జీవన్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తమ్మునిలాంటి వాడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాలలో బీఆర్ఎస్ రాజ్యం నడుస్తుందా.. లేదంటే కాంగ్రెస్ రాజ్యం నడుస్తుందాని అని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాజ్యంలో కాంగ్రెస్ నాయకులకే రక్షణ కరువైందని మండిపడ్డారు. పక్కా ప్లాన్ ప్రకారమే గంగారెడ్డిని హత్య చేసినట్టు ఎమ్మెల్సీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మమ్ములను చంపేసింది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెక్కడ కాంగ్రెస్ పార్టీ అంటూ జీవన్ రెడ్డి మండిపడ్డారు.


## గంగుల కమలాకర్ కు మాతృవియోగం....

## సంతాపం ప్రకటించిన కేసీఆర్



తెలంగాణ వీణ, హైదరాబాద్ : బీఆర్ఎస్ కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తల్లి గంగుల నర్సమ్మ ఈ ఉదయం కన్నుమూశారు. నర్సమ్మ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరోవైపు గంగుల కమలాకర్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

## ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు..







తెలంగాణ వీణ, జాతీయం : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఖమారియాలోని ఎఫ్6 సెక్షన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఇందులో దాదాపు పది మంది ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పాటు ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం అందుతోంది. ఘటన తర్వాత గందరగోళ వాతావరణం నెలకొనగా, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఖమారియా ఆసుపత్రిలో చేర్చగా.. ఫ్యాక్టరీ యాజమాన్యం వారిని చూసుకొంటోంది. ఎఫ్–6 సెక్షన్‌లోని భవనం నంబర్ 200లో పేలుడు సంభవించింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఖమారియా జనరల్ మేనేజర్, ఇతర అధికారులు కూడా సంఘటన స్థలంలో ఉన్నారు. కానీ వారు ఇంకా మీడియాతో సమాచారాన్ని పంచుకోవడం లేదు. గాయపడిన వారిని పరామర్శించేందుకు కాంట్ అసెంబ్లీ ఎమ్మెల్యే అశోక్ రోహని కూడా ఆస్పత్రికి వచ్చారు. జబల్‌పూర్‌లోని సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ ఆర్డినెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఖమారియాలో మంగళవారం ఉదయం ఈ భారీ పేలుడు సంభవించింది. ఇందులో ఇద్దరు వ్యక్తులు మరణించగా, దాదాపు డజను మంది ఉద్యోగులకు కాలిన గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బాంబు నింపే సమయంలో ఈ పేలుడు సంభవించినట్లు సమాచారం. ఫ్యాక్టరీలోని ఎఫ్–6 విభాగంలో బాంబు నింపే పని జరుగుతుండగా.. ఒక్కసారిగా హైడ్రాలిక్ సిస్టమ్ పేలింది. పేలుడు శబ్దం చాలా పెద్దగా వినపడింది. దాని శబ్దం ఐదు కిలోమీటర్ల వరకు వినబడింది. ఘటనానంతరం, గాయపడిన ఉద్యోగులను ఆసుపత్రికి తరలించారు. అక్కడ తీవ్రంగా గాయపడిన రణధీర్, శ్యామ్‌లాల్, చందన్ లను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇక పేలుడు ఎలా జరిగింది? ఎవరి నిర్లక్ష్యమే కారణమన్న దానిపై విచారణ కొనసాగుతుంది.



- హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై.. గవర్నర్, డీజీపీలను కలిశాం – ఎంపీ ఈటల రాజేందర్
- ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుంది– ఈటల
- ముత్యాలమ్మ గుడి విషయంలో ప్రశాంతంగా ర్యాలీ నిర్వహించాం, కొంత మంది బయట వాళ్ళు వచ్చి చెప్పులు వేశారు– ఈటల.